ప్రజాశక్తి

ఆదివారం 6 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మోడీ పర్యటన నేపథ్యంలో..

నివేదికల తయారీలో ప్రభుత్వ శాఖలు

రాష్ట్రానికి, విశాఖకు బిజెపి హయాంలో వచ్చిన పథకాలపై కేంద్రం ఆరా !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ శాఖలన్నీ నివేదికల తయారీలో బిజీ బిజీగా ఉంటున్నాయి. 11వ తేదీ రాత్రికి విశాఖకు ఆయన సహా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, వైపిపి హడావుడి చేస్తున్నాయి. రాష్ట్రానికి అలాగే విశాఖకు మోడీ హయాంలో వచ్చిన పథకాల వివరాలను అధికార యంత్రాంగం సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. దీంతో విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం, ఎస్‌సి కార్పొరేషన్, సహకార రంగం, ఇరిగేషన్, సామాజిక భద్రత, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, బ్యాంకింగ్ రుణాలు వగైరా అన్నిటిపైనా ఆయా శాఖల సిబ్బంది తలమునకలయ్యారు. రుణాలు, పథకాలు, స్కాలర్‌షిప్‌లు, దళిత, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం నిధుల విషయంలో విశాఖకు, ఆంధ్రప్రదేశ్‌కు ఎన్ని రకాలుగా కేంద్రం సాయం చేసిందన్న అంశాలపై పూర్తిస్థాయి నివేదికలతో యంత్రాంగం సిద్ధమవుతోంది. ఆయా శాఖల అధిపతుల ద్వారా జిల్లా కలెక్టర్‌కు మరో రెండు రోజుల్లో అవి చేరనున్నాయి.



మోడీ పర్యటన నేపథ్యంలో పలు శాఖల అధికారులతో సమీక్ష జరుపుతున్న కలెక్టర్ మల్లికార్జున

సభా ఏర్పాట్లలో వైసిపి

నగరంలోని ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో 12న జరుగనున్న బహిరంగ సభను భారీగా నిర్వహించేందుకు బిజెపి కంటే వైసిపియే చొరవ చేస్తోంది. గడచిన నాలుగు రోజులుగా విశాఖలోనే వైసిపి రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి తిష్టవేసి పరిస్థితులను అదుపులో పెట్టుకునేందుకు పర్యటనలు సాగిస్తున్నారు. ప్రతిరోజూ ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ సభా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సమీక్షిస్తున్నారు. ఈ కదలికలపై తాజాగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ స్పందిస్తూ... 'వైసిపి చొరవపై ఆ పార్టీ వాళ్లు అత్యుత్సాహం చూపుతున్నారు' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. దీనిపై వైసిపిలో కొంతమంది పెద్దలు మాట్లాడుతూ మేసే గాడిదొచ్చి కూసే గాడిదను చెడగొట్టిన ట్లుందంటూ రివర్స్‌లో మిగతా 2లో..



మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకటరెడ్డి

హెల్త్ అలవెన్సును రికవరీ చేయొద్దని..

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పారిశుధ్య కార్మికుల జీతాల నుండి ఈ ఏడాది జనవరి నుంచి చెల్లించిన హెల్త్ అలవెన్సును రికవరీ చేయొద్దని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసినందుకు నిరసనగా జులైలో ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన సమ్మె అనంతరం ప్రభుత్వం హెల్త్ అలవెన్సును కొనసాగించాలని జిఒ 109ని విడుదల చేసిందన్నారు. జనవరి నుంచి బకాయిలు కూడా చెల్లించిందన్నారు. అయితే విజయవాడ, ఇబ్రహీంపట్నంలోని సిఎఫ్ఎంఎస్ అధికారులు జనవరి నుండి చెల్లించిన హెల్త్ అలవెన్స్‌ను కార్మికుల జీతాల నుండి రికవరీ చేయాలని గత నెల 10న ట్రెజరీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సబ్ ట్రెజరీ అధికారులు ఒహెచ్ఎను రికవరీ చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. కార్మికులు పోరాడి నిలబెట్టుకున్న హెల్త్ అలవెన్సును జీతాల నుండి రికవరీ చేయడం మిగతా 2లో..

నేవల్ బేస్ నిర్వాసితుల ఉద్యమం ఉధృతం

▸ వార్త మెయిన్‌లో..

'ముదపాక'లో అధికార పార్టీ నేతల అక్రమాలు

▸ వార్త 2లో..

కళాభారతిలో రంగసాయి నాటకోత్సవాలు

▸ వార్త 2లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యనమల

దివాళా వైపు రాష్ట్రం

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

వార్త మెయిన్‌లో..

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

- రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రధాని పర్యటనలో వివరించండి
- సిఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుని రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు అండగా నిలవాలని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ రాసింది. అందులోని వివరాలను వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ శనివారం మీడియాకు వివరించారు. ఇప్పటికే వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదు.. సరికదా ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటిస్తున్నారన్నారు. అలా అమ్మడం సాధ్యం కాని పక్షంలో పరిశ్రమను మూసేస్తామేగానీ నడపబోమని కేంద్ర మంత్రులు పార్లమెంటు సాక్షిగానే ప్రకటన చేసిన విషయాన్ని అజశర్మ గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్మినా, మూసివేసినా రాష్ట్ర ప్రయోజనాలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీరని హాని జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకొని కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో అది రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని అజశర్మ ఉటంకించారు. విశాఖలో జరిగే ప్రధాని సభలో ఆయనతోపాటు తమరూ ఉన్నందున విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రధానిని అడగాలని సిఎంను కోరారు. అదే సందర్భంలో రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడం లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, విశాఖ, విజయవాడ మెట్రో రైలు వంటివి సాధ్యం కాదని కేంద్రం చేతులు దులిపేసుకుందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులను నిలిపివేసిందన్నారు. ఉత్తరాంధ్రలో నిర్మించవలసిన పెట్రో యూనివర్సిటీ ఇంకా నిర్మాణమే ప్రారంభం కాలేదని, గిరిజన యూనివర్సిటీకి స్థల సేకరణ కూడా జరగలేదని తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఇస్తామని ప్రకటన చేశారుగానీ ఇంకా ఆచరణ రూపం దాల్చలేదన్నారు. శతాబ్దంపైగా చరిత్ర కలిగిన విశాఖపట్నం రైల్వే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'ఉక్కు' ప్రయివేటీకరణను అడ్డుకోండి

డివిజన్‌ను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఉత్తరాంధ్రకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం రైల్వే డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు ఉండాలని ప్రధానిని కోరాలన్నారు. రాష్ట్ర విభజన చట్టాన్ని, దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేలా చూడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం ఈ నెల 9 నుంచి 12 వరకు వివిధ రూపాలలో నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించారని, ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం వంటి చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడితే అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వత్తాసు పలకడమే అవుతుందన్నారు.

నివేదికల తయారీలో ప్రభుత్వ శాఖలు

స్పందించారు. ఏదిఏమైనా మోడీ పర్యటన నేపథ్యంలో అధికార, రాజకీయ వ్యవహారాలన్నీ హాట్‌హాట్‌గానే సాగుతున్నాయని చెప్పొచ్చు.

రైల్వేలోనూ సందడి

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎయు గ్రౌండ్స్ నుంచే 12న విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌కు రాయి వేస్తారన్నది తెలిసిందే. దీంతో రైల్వేలో వివిధ విభాగాలకు చెందిన అధికార, సిబ్బంది నివేదికలను సిద్ధం చేసుకుంటున్నారు. 2019 ఫిబ్రవరి 28న విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలుపుతూ రూ.4.40 కోట్లు మంజూరు చేసింది. కొత్తజోన్‌కు సుమారు 67 వేల మంది సిబ్బంది అవసరమని డిపిఆర్‌లో నాడే పొందుపరిచారు. ఈ జోన్ పరిధిలో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు ఉంటాయి. నగరంలోని వైర్‌లెస్ కాలనీలో కొత్త రైల్వేజోన్ కోసం 8 ఎకరాల్లో రూ.100 కోట్లతో 7 ఫ్లోర్లలో ప్రధాన కార్యాలయ నిర్మాణం పనులకు లాంఛనప్రాయంగా ఈ నెల 12న పిఎం మోడీ, సిఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారన్నది సమాచారం.

మున్సిపల్ కార్మికుల ధర్నా

జగన్ ప్రభుత్వానికి తగదని, ఇది దుర్మార్గమని విమర్శించారు. ప్రాణాలకు తెగించి పారిశుధ్య కార్మికులు కోవిడ్ సమయంలో విధులు నిర్వహించారని, ప్రజలు, అధికారులు, ఆఖరికి దేశ ప్రధాని మోడీ వంటి వారు వీరి సేవలను గుర్తించి కార్మికుల కాళ్లు కడిగారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ కూడా పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ పారిశుధ్య కార్మికులకు లక్ష జీతం ఇచ్చినా తక్కువేనని చెప్పారన్నారు. అటువంటి పారిశుధ్య కార్మికులకు ఈసరికే చెల్లించిన హెల్త్ అలవెన్సును తిరిగి ఇవ్వాలనడం సరికాదన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నూకరాజు, ఉరుకూటి రాజు, ఎం.ఈశ్వరరావు, నాయుడు, ఎస్.గణేష్, బి.రాంబాబు, బి.రత్నం, ఎస్.రమణ, దివ్య, శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికస్థితిపై యనమల అసత్య ప్రచారం : అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్ర ఆర్థికస్థితిపై మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు తాను మేధావిగా యనమల ఊహించుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక మంత్రిగా యనమల చేసిన ఆర్థికపరమైన అన్యాయాలు, రాష్ట్రానికి చేసిన అన్యాయాలు మర్చిపోయి, వాటన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

పిల్లల్లో లోపాలను సరిదిద్దాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన హత్యపై రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జయశ్రీ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ప్రయివేటు కార్యక్రమంలో శుక్రవారం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్లో లోపాలను గుర్తించి సరిదిద్దాలన్నారు. విద్యార్థిని హత్య కేసులో తండ్రి ఆవేశంతో కాకుండా ఆలోచనతో ప్రవర్తించి ఉంటే ఆ బిడ్డ ప్రాణం దక్కేదన్నారు.

ప్రధాని పర్యటన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 12న విశాఖపట్నంలో జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభా కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమమని, సిఎం జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీకి చెందిన జివిఎంసి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్‌ఛార్జిలతో ఆయన శనివారం సమావేశమై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు సత్యవతి, ఎంవివి.సత్యనారాయణ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల కార్యక్రమాలు నిర్వహించాలని బాల వికాస ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

కమలం.. వక్రీకరణల పర్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు'... అన్న సామెత విశాఖలోని కమల దళ ప్రతినిధులకు అక్షరాలా వర్తిస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఓ పక్క ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టి దేశ ప్రజల మీద అనేక రూపాల్లో భారాలు మోపుతూ నీతులు వల్లించడం వారికే చెల్లునేమో మరి. పైగా స్థానిక ప్రభుత్వాల్లోనూ జొరబడి పనులకు ఆటంకం కలిగించే స్థితి కల్పించడం వీరి నిర్వాకానికి నిలువుటద్దంగా మారింది. తాజాగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో బిజెపికి చెందిన ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ వ్యవహారం విశాఖ, ఉత్తరాంధ్రకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోన్న ద్రోహాలపై చర్చ జరగనివ్వని వైనం విశాఖ ప్రజల విమర్శలకు గురైంది. స్థానిక సంస్థల్లో ఈ ప్రాంత ప్రాజెక్టులు, పరిశ్రమలు వాటి విస్తరణ, ప్రభుత్వ విధానాలతో జరుగుతున్న నష్టాలపై స్థానిక ప్రజాప్రతినిధులు గళమెత్తాలి. కానీ కమల ప్రతినిధి అడ్డుతగులుతూ ఈ ప్రాంత పరిశ్రమలపైనా, అభివృద్ధిపైనా వక్రీకరణలకు దిగడం విచారకరం. జివిఎంసి పరిధిలో అభివృద్ధిపైనా సభ్యులు తమ అభిప్రాయం చెప్పే అవకాశం ఈ కౌన్సిల్‌లో దక్కకపోవడం కనిపిస్తోంది. విశాఖ నగరం అందమైన నగరం అన్నది అన్ని రాజకీయ పార్టీలు, అన్ని తరగతుల ప్రజానీకం అంగీకరిస్తున్న వాస్తవం. గడచిన కొద్ది నెలలుగా విశాఖ నగర అభివృద్ధిపై పాలకులు ఎలాంటి శ్రద్ధా చూపలేదు. రోడ్లన్నీ పెద్ద పెద్ద గతుకులతో దర్శనమిస్తున్నాయి. రూ.వేల కోట్ల వార్షిక బడ్జెట్ కలిగిన జివిఎంసి నగర జనాభాకు రోడ్లు వేసే కనీస కర్తవ్యం కూడా నిర్వహించలేకపోతోంది. పేచ్ వర్క్స్ (రిపేర్లు) కూడా చేయలేని దుస్థితిలో పాలకవర్గం పడింది. ఈ అంశాలేవీ ప్రాధాన్యతలుగా చర్చ జరగకుండా స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై అడ్డగోలు వాదనలకు బిజెపి నేత దిగడంతో అజెండాలోని అంశాలన్నీ అధికార పార్టీ కార్పొరేటర్లతో క్షణాల్లో ఆమోదమైపోయి సమస్యలన్నీ పక్కదారిపట్టాయి.

ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి ఏదీ ?

విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంత సమూల అభివృద్ధికి మూలమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం, లేదంటే అమ్మేయడం వంటి నిర్ణయం చేసిన పార్టీలో ఉండి ఆ



నిర్ణయాన్ని సమర్థించుకునే యత్నాలకు ఈ నేత దిగాడు. పైపెచ్చు యుపిఎ-1, యుపిఎ -2లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ నిర్ణయం జరిగిందంటూ 'వెనక్కి వెళ్లడం' చూస్తే అభివృద్ధి నిరోధక భావజాలంలో కొట్టుమిటాడుతున్నాడనడానికి ఇంతకంటే ఉదాహరణ మరొకటి లేదు. గతంలో ఏదైనా తప్పు జరిగితే అది తప్పు అయితే దాన్ని ఎందుకు అమలు చేయాలి ? వారు చేశారు కాబట్టి మేం కొనసాగిస్తామనడం సమంజసమా ?.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఎంతో నేడు అందరికీ అర్థమవుతోంది. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖకు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాక సందర్భంగా జివిఎంసి కౌన్సిల్‌లో 'ఉక్కు' చర్చను సిపిఎంకు చెందిన 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు లేవనెత్తగా అధికార పార్టీలోని కొంతమంది సభ్యులు, గౌరవ మేయర్ సహా ప్రతిపక్ష సభ్యులైన తెలుగుదేశం, సిపిఐ, జనసేన ప్రతినిధులు హర్షామోదం తెలిపారు. కానీ అడ్డంగా మాధవ్ వాదనలకు దిగడం సభలో కొంత గందరగోళానికి తావిచ్చినట్టయింది. విశాఖలోగల బిహెచ్‌పివి, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వమే కాపాడిందంటూ బుకాయింపునకు మాధవ్ దిగడం విడ్డూరంగా ఉంది.

కాషాయ దళానికి ఎప్పుడూ కసాయి పాత్రే...

హిందుస్థాన్ జింక్ పరిశ్రమను అడ్డగోలుగా మూసివేసిన ఘనచరిత్ర మాధవ్ పార్టీకే ఉంది. భూములిచ్చిన రైతులు పేదరికంతో రోడ్డున పడగా, ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనవుతూనే ఉన్నారు. సుమారు 400 ఎకరాలకు పైగా జింక్ సంస్థకు చెందిన రూ.వందల కోట్ల భూమిని అమ్మేసుకోడానికి కేంద్రంలోని బిజెపి పావులు కదుపుతోంది. తాజాగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఇదే గతి పట్టించే వ్యూహరచనలో బిజెపి ఉందన్నది ఉత్తరాంధ్ర ప్రాంతమే కాదు యావత్ రాష్ట్ర ప్రజలంతా గుర్తించారు. బిజెపి నిర్ణయాన్ని స్థానిక పంచాయతీ నుంచీ దేశ చట్టసభల వరకూ ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున విశాఖ కేంద్రంగా ఉద్యమం సాగుతోంది. మోడీ విశాఖ రాక సందర్భంగానైనా ఇక్కడ పరిస్థితులను, కార్మికవర్గ కష్టాలను చెప్పుకోవడానికి స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు సిద్ధమైన క్షణంలో బిజెపికి చెందిన ఎమ్మెల్సీ మాధవ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని సమర్థిస్తూ మాట్లాడడం ఆ పార్టీ తాలూకా అభివృద్ధి వ్యతిరేక, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానానికి తార్కాణమన్నది సర్వత్రా వినిపిస్తోంది.

కళాభారతిలో రంగసాయి నాటకోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నాటక రంగ దిక్సూచి రావూజీ 84వ జయంతి సందర్భంగా రంగసాయి నాటక సంఘం నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి తెలిపారు. శనివారం రంగసాయి నాటక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న సోమవారం 5 గంటలకు కళాభారతి వేదికగా నాటకోత్సవం జరుగుతుందని తెలిపారు. కన్యాశుల్కం నాటకంతో పాటు రైతు జీవితం ఆధారంగా రావి నాగేశ్వరరావు రచించిన సంకల్పం నాటికను కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. గురజాడ అప్పారావు కలం నుండి జాలు వారిన కన్యాశుల్కం నాటకానికి ఈపు విజయకుమార్ దర్శకత్వం వహించారని అన్నారు. సూర్య లక్ష్మీ భోగరాజు నిర్వహణ బాధ్యతలు చేపట్టారన్నారు. సంకల్పం నాటిక, కన్యాశుల్కం నాటకంలో అందరూ మహిళలే నటిస్తున్నారని ఆయన వివరించారు. జిఎస్.రావు రచించిన వాయిదాల పెళ్లి నాటికకు సంధ్య ప్రియదర్శిని దర్శకత్వం వహిస్తున్నారని చెప్పారు. ఇదే వేదికపై మాస్టర్ సిరికి రఘురాంచే అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం కూడా ఉంటుందని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, ప్రోత్సాకులు ఈ నాటకోత్సవానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి ఈ ఉత్సవాలకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాటకోత్సవం సంధానకర్త ఎన్ఎన్ఆర్, సీనియర్ మహిళా నటులు సంధ్యా ప్రియదర్శిని, డి.హేమ, శివ జ్యోతి, సీతామహాలక్ష్మి, పంతులు, లలిత, జమ్మా చిన్నబాబు, పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

కవితపై చర్యలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శుక్రవారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో బిజెపి కార్పొరేటర్ గంకల కవితపై మేయర్ తీసుకున్న చర్యలు అప్రజాస్వామికంగా ఉన్నాయని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

'ముదపాక'లో అధికార పార్టీ నేతల అక్రమాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెందుర్తి మండలం ముదపాక గ్రామంలో ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేపట్టిందని, భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకురాగా ఆ భూముల సర్వే సమయంలో అధికార పార్టీ నాయకులు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామ రైతులు నీలాపు రమణ, నీలాపు రమేష్ ఆరోపించారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ సర్వే చేస్తున్న సర్వే నెంబర్లలో నిజమైన రైతుల పేర్లు తొలగించి, భూమిలేని కొంత మంది వ్యక్తుల పేర్లను ఎల్‌పిఓసి జాబితాలో చేర్చారన్నారు.

భూదందాకు పాల్పడి, రైతులను బెదిరించి తక్కువ రేట్లకే స్థలాలను కాజేయాలని చూస్తున్న భూ రాబందు, భూకబ్జాదారుడు నడింపల్లి రామరాజును వెంటనే అరెస్టు చేసి, రైతుల పేర్లతో ఆయన కాజేసిన ఎల్‌పిఓసిలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పెందుర్తి తహశీల్దార్ ఆనందకుమార్, విఆర్‌ఒ నిర్మల ఈ ల్యాండ్ పూలింగ్ పేరుతో దందా నడిపారన్నారు. ఈ కుంభకోణంలో వందల కోట్లు సంపాదించిన వారి బినామీల ఆస్తులను సీజ్ చేసి ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ముదపాక ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై సిబిఐతోగానీ, సిబిసిఐడితోగానీ ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు. సమావేశంలో ముదపాక అప్పారావు, సరిపల్లి భీమేశ్వరరావు, పర్రి శివ, సియాద్రి దుర్గారావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు

మండల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎండిఒ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపిపి దంతులూరి వెంకటశివసూర్య నారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫిర్యాదులతో నిమిత్తం లేకుండా ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను గుర్తించి, వాటిని సరి చేయాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన స్థలాల్లో నిర్ణీత సమయంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు బోని బంగారు నాయుడు, సురపతి దుర్గాలమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎండిఒ పి.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. ఎస్ రాయవరం మండలం కొరుప్రోలు గ్రామానికి చెందిన కొంగర సూర్యచంద్ర మనోరాజ్యలక్ష్మి (35) అక్క అమ్మాయి శరణ్యతో కలిసి బైక్ పై తుని వెళ్లి వస్తుండగా నక్కపల్లి హైవే జంక్షన్ వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెనక కూర్చున్న కొంగర సూర్యచంద్ర మనోరాజ్యలక్ష్మి రోడ్డుపై పడటంతో లారీ ఆమెపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు 9 సంవత్సరాల అమ్మాయి ఉంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.



ఆసుపత్రిని సందర్శించిన మైలపల్లి లక్ష్మణరావు

సిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు శనివారం సందర్శించారు. సాధారణ రోగులు, గర్భిణిలు, బాలింతలకు, చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలనడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. అవసరమైన మందులు కూడా అందుబాటులోనే ఉన్నట్లు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి వల్లనే ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు లక్ష్మణ రావు తెలిపారు.

రెండో సెమిస్టర్ పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండల విద్యాశాఖ కార్యాలయంలో సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఇఒ ఎస్.పద్మావతి తెలిపారు. గతంలో మొదట, మూడవ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని, రెండవ విడత సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు కార్యాలయానికి చేరుకున్నాయని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని తెలిపారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపించినున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -కంచరపాలెం : గౌరీ పరమేశ్వరుల ప్రతిష్ట మహోత్సవం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన వైభవంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను కంచరపాలెం మెట్టు వద్ద గల ముత్యమాంబ ఆలయం నుంచి కంచరపాలెం రైతు బజార్ ఎదురుగా మల్లసూరి వీధిలో గల సంగం ఆఫీస్ వరకు ఊరేగించారు. సేవ, గరిడి, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా వెళ్లి మండపం వద్ద ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ వరి దుబ్బును తలపై మోస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. 31 ఏళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొణతాల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులు దాడి సూరప్పారావు, ప్రధాన కార్యదర్శి ముల్లేటి రామప్పనాయుడు, కోశాధికారి మల్ల సత్యనారాయణ మూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించాలి : లోక్‌సత్తా

ప్రధాని నరేంద్రమోడీని ఒప్పించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా సాధించాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఈ నెల 11వ తేదీన విశాఖ వస్తున్న మోడీపై ఒత్తిడి తెచ్చేందుకు రంగం సిద్ధం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న పశువైద్యాధికారి లీలారాణి

పశు వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆనందపురం : పశువులకు సంక్రమించే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రౌతు శ్రీను సూచించారు. పాలవలస గ్రామంలో పశు విజ్ఞానబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పశువులకు వ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురవుతున్నాయని తెలిపారు. గత కొంత కాలంగా పశువులకు ముద్ద చర్మ వ్యాధి అధికంగా వస్తోందన్నారు. ఈ వ్యాధిని గుర్తించి ముందుగానే మేల్కోపోతే పాడి రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్నారు. పాడి రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ లీలారాణి పశువులకు ఎల్‌ఎస్‌డి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎహెచ్‌ఎ రఘురాం, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2022 - 23 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును నవంబరు 15 వరకు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఇప్పటి వరకు ఈ పరీక్షకు 1818 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షను 2023 జనవరి 5న రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్ సైట్ www.bse.ap.gov.in నుగానీ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలన్ని గానీ సంప్రదించాలని సూచించారు.

ఏదీ ఆహ్లాదం ?

ప్రజాశక్తి -మధురవాడ : ఆహ్లాదం అందించాల్సిన పార్కు నేడు దీనావస్థలో ఉండడంతో అక్కడికి వచ్చేవారు నిరుత్సాహం చెందుతున్నారు. 8వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎండాడ పెద్ద చెరువును 2017లో జీవీఎంసీ సుమారు రూ.1.50 కోట్లతో ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దింది. అక్కడకి వచ్చే సందర్శకులకు ఆహ్లాద వాతావరణాన్ని అందివ్వాలన్న ఉద్దేశంతో పార్కు, వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసి సుందరంగా సిద్ధం చేశారు. ప్రస్తుతం ఇక్కడ పర్యవేక్షణ లేకపోవడం తుప్పలు పేరుకుపోయి, బెంచీలు విరిగిపోయి పరిసరాలు దుర్భరంగా తయారయ్యాయి. చెరువులో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క పెరిగి అధ్వానంగా తయారైంది. కొందరు దీన్ని డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. అధికారులు శుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్ బండ్‌ను అహ్లాదకరంగా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదరణకు నోచని ఎండాడ చెరువు

హెల్త్ అలవెన్సుల రికవరీ నిలిపివేయాలి

సిఐటియు డిమాండ్



పారిశుధ్య కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి హెల్త్ అలవెన్సులను రికవరీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జోనల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు జరిపిన పోరాట ఫలితంగా హెల్త్ అలవెన్సును కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే వారి అలవెన్సులను జీతాల నుంచి రికవరీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పారిశుధ్య నిర్వహణ నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, పారిశుధ్య కార్మికుల సంఘం ప్రతినిధులు సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి తీర్థప్రసాదాలను ఆనంద్‌కుమార్ అందించారు.

మెరుగైన నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానం, మెరుగైన నైపుణ్యాలు అందించడం వల్ల ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతాయని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం ఉదయం ఎన్ఇపి 2020 ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ ఫర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దీనిని కార్యరూపంలో చూపుతూ 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్న విధానం వివరించారు. అనుబంధ కళాశాలలు నాక్ గుర్తింపును పొందే విధానం వివరించారు. దీనిపై కళాశాలలకు అనేక అపోహలు, సందేహాలు ఉన్నాయనే అంశాన్ని ప్రస్తావిస్తూ వాటిని నివృత్తి చేశారు. కళాశాలలకు అవసరమైన భవనం, తరగతిగదులు, మౌలిక వసతులు ఉన్న కళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బోధన సిబ్బంది అంశంలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కరికులం అమలు చేసే బోధన సిబ్బంది ఉన్న ప్రతి కళాశాలా నాక్ గుర్తింపుకు వెళ్లవచ్చన్నారు. ఐదేళ్ల కాలానికి నాక్ గుర్తింపును పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధానాలను వివరించారు.

వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, అనుబంధ కళాశాలలు త్వరలో నాక్ గుర్తింపును సాధించాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, గ్లోబల్ మార్కెట్‌కు ఉపయుక్తంగా యువతను తయారుచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. టెక్నాలజీని విద్యలో మిళితం చేయాలని సూచించారు. వివిధ ర్యాంకింగ్ సంస్థలకు అందించే సమాచారంలో స్పష్టత, ఖచ్చితత్వం కలిగి ఉండాలన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, అందరికీ నాణ్యమైన విద్యను అందించడం నూతన విద్య విధానం 2020 లక్ష్యమన్నారు. నాలెడ్జ్ సూపర్ పవర్‌గా భారత్ నిలుస్తుందన్నారు. నాక్ గుర్తింపు నాణ్యతకు చిహ్నంగా నిలుస్తుందనే విషయం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ లెవెల్ నాక్ చైర్మన్ ఆచార్య కె.రాంజీ, ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి

ప్రజాశక్తి-గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని వైఎస్ఆర్‌టియుసి నాయకులు శనివారం ఎంపీ ఎంవివి.సత్యనారాయణను కలిసి కోరారు. ఈ నెల 11వ తేదీన విశాఖ వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ప్రజల ఆకాంక్షను తీసుకెళ్లి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ సంస్థగానే కొనసాగించే ప్రకటన చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, గొందేసి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, బోరా శశిభూషణరావు, గొందేశీ అప్పలరెడ్డి, గెద్దాడ అప్పలరాజు, కూటికుప్పల జనార్ధన్, బి.రామకృష్ణ శకునాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి

ప్రజాశక్తి-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషిచేయాలని టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు విజ్ఞప్తి చేశారు. పెదగంట్యాడ యూనియన్ కార్యాలయంలో పాండురంగ జయరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు వేర్వేరుగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా స్టీల్ ఉత్పత్తిని తగ్గించి కంపెనీకి నష్టం చేస్తూనే ఉందని వివరించారు. కనుక అన్ని రాజకీయ పార్టీలూ ఐక్యంగా ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సమావేశంలో కరణం సత్యారావు, ఎమ్.ప్రకాష్‌యాదవ్, ఎమ్‌కె.రెడ్డి, బొడ్డు రమణ, జె.జాన్, డి.నరసింగరావురెడ్డి, కె.సోమేష్, యు.సింహాద్రి అప్పన్న, పేర్ల నూకరాజు, ఎం.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో పట్టభద్రుల ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జివిఎంసి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యాన రాజేంద్రనగర్‌లో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డులోని సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



మినీ రోల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల ప్రారంభంలో కెకె.రాజు

మినీ రోల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధార వైశాఖి స్పోర్ట్స్ పార్కులో 3వ సౌత్ ఇండియా మినీ రోల్ బాల్ ఛాంపియన్ షిప్ 2022-23 పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు ప్రెసిడెంట్ సనపల వరప్రసాద్, బి.సూర్యనారాయణ, శాంతి భూషణ్, ఎంవి.రెడ్డి, కె.విశ్వనాధ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి అపెరల్ పార్కులో కుట్టు శిక్షణను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 మందికి మహిళలకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ బ్యాచ్ పూర్తయిన తర్వాత కూడా రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపెరల్ పార్క్ అడ్మినిస్ట్రేటర్ పద్మ, స్థానిక వైసిపి నాయకులు శ్రీనివాసరావు, దానప్పలు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

సీవేజ్ ప్లాంటును వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి- గాజువాక : అగనంపూడి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్లాంట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగనంపూడిలో జీవీఎంసీ అధికారులు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఐదేళ్ల క్రితం నిర్మించినా ఇంతవరకు వినియోగంలోకి తేలేదన్నారు. అగనంపూడి నుంచి దువ్వాడకు వెళ్లే రోడ్డుపై వీధిలైట్లు వేయలేదని తెలిపారు. అగనంపూడి కాలనీలో కాలువలు ఏర్పాటుచేయాలని కోరేరు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోవిందరావు, నిర్వాసిత నాయకులు నర్సింగరావు, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సత్యనారాయణ తదితరులు

మృతుని కుటుంబానికి చేయూత



మృతుని కుటుంబానికి
ఆర్థిక సహాయం చేస్తున్న నక్క లక్ష్మణరావు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి హిమాచల్‌నగర్‌లో ఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్న పండూరి థెరిసా భర్త పండూరి నర్సింగరావు (55) అనారోగ్యంతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు నక్క లక్ష్మణరావు శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్యకు రెండు నెలలకు సరిపడా రేషన్ నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరుకుటి మహేష్ యాదవ్, రామారావు (తారక్), రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య సేవలందించడానికి కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షహనాజ్ సాధ్య తెలిపారు. రామవరం గ్రామంలో కుటుంబ డాక్టర్ విధాన ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలంగా బాధపడుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలందించారు. స్థానిక సర్పంచ్ ఎర్ర పైడిరాజు మాట్లాడుతూ, గ్రామాల్లోని ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోపరుచుకోవాలని కోరారు. బాలింతలు, మధుమేహం, రక్తపోటు తదితరాలకు సుమారు 63 మందికి వైద్య పరీక్షలు జరిపారు. అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ జి.ఆదిత్య మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడే మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి మాట్లాడుతూ, ఇంటి పరిసరాలలో నీటి నిలువలు లేకుండా చూసుకుంటే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. దీని ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గునియా, టైఫాయిడ్ తదితర వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.పుష్పారావు, డిపిఎం ఒ ప్రసాదరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పి.సన్యాసిరావు, సిహెచ్‌ఒ పూర్ణిమ, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.నర్సింహమూర్తి, ఎస్.బంగారమ్మ. డిఇఒ కె.జ్ఞానేశ్వరరావు, ఆశా కార్యకర్తలు ఎర్ర ఈశ్వరమ్మ, లక్ష్మి, పైలెట్ బి.తాతబాబు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ క్లినిక్‌ల ద్వారా అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి ముంగిటకే వైద్యం అందుతున్నట్లు ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు తెలిపారు. మండలంలోని మూలకుద్దులో వైఎస్ఆర్ క్లినిక్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వైద్యులు కీర్తి సందీప్, శివ రామ కృష్ణారావుతో ఎంపిపి మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి పార్వతి, ఉప సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, వైసిపి యూత్ లీడర్ కోటిరెడ్డి, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి సింధూర గెస్ట్ హౌస్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల్లో భాగంగా ఈ శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అనీల్‌కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఎఇ శ్రీరామమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పరిశీలన

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 74వ వార్డు పరిధిలోని కాలనీల్లో దెబ్బతిన్న కాలువలు, డ్రెయినేజీలు, తాగునీటి పైపుల మరమ్మతు పనులను శనివారం ఆ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. వార్డులో కాలువలు, డ్రెయినేజీలు, వాటర్ పైపుల లీకేజీలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు, యువత ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ వంశీరెడ్డి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులు చేపట్టారు. మరమ్మతు పనులలో జాప్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు.

రాఘవేంద్ర పాఠశాలలో పేరెంట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డిఫెన్స్ అకాడమీకి చెందిన శ్రీ రాఘవేంద్ర పాఠశాలలో శనివారం పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తాతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ వేడుకలు వల్ల మానవ సంబంధాలు, సోదర భావం పెరుగుతుందన్నారు. వారం క్రితం విద్యార్థులు తల్లిదండ్రులకు, తాతలకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈద్గా స్థల కేటాయింపునకు వినతి

ప్రజాశక్తి -కంచరపాలెం : జీవీఎంసీ 53వ వార్డు పరిధి మర్రిపాలెంలో ఉన్న ముస్లిం సోదరులు నమాజ్ చేసుకునేందుకు మర్రిపాలెం పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఆర్ అండ్ బి స్థలాన్ని ఈద్గాకు కేటాయించాలని కోరుతూ వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి మజీద్-ఆల్-ఫత్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. ముస్లిం సోదరుల విన్నపం మేరకు గతంలో ముడసర్లోవ సర్వే నెంబర్ 27లో 86 సెంట్లను ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. మర్రిపాలెం నుంచి నమాజ్‌కు అంత దూరం వెళ్లే అవకాశం లేనందున, తమకు కేటాయించిన స్థలాన్ని ఆర్.అండ్.బికి అప్పగించి మర్రిపాలెంలో ఉన్న స్థలాన్ని తమకు కేటాయించేలా చూడాలని కోరారు.

అనుమతుల్లేకుండా డీజిల్ తరలింపు

★ 24 వేల లీటర్లతో ట్యాంకర్‌ను సీజ్ చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

★ గత నెల 22న పట్టుబడినా నేటికీ వివరాలు వెల్లడించని వైనం

★ పలు అనుమానాలకు తావిస్తున్న అధికారుల వైఖరి

ప్రజాశక్తి - యలమంచిలి, యలమంచిలి రూరల్

ఎటువంటి అనుమతుల్లేకుండా పెద్ద మొత్తంలో డీజిల్ తరలింపు వ్యవహారం ప్రజాశక్తి చొరవతో వెలుగు చూసింది. యలమంచిలి దగ్గర ఓ పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకర్ రోజుల తరబడి ఉండటాన్ని గమనించిన ప్రజాశక్తి, అధికారులను వివరణ కోరడంతో 24వేల లీటర్ల డీజిల్‌తో ట్యాంకర్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొని సీజ్ చేసినట్లు బయటపడింది. ఈ డీజిల్ ట్యాంకర్ అక్టోబర్ 22న పట్టుబడినా నేటికీ పోలీసులు కేసు వివరాలు వెల్లడించకుండా గోపత్య పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమంగా డీజిల్ వ్యాపారం సాగుతుందా? అన్న సందేహాలు కలుగుతున్నాయి.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ వివరణ

ఈ విషయంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విశాఖ రీజినల్ సిఐ లక్ష్మోజిని ప్రజాశక్తి శనివారం వివరణ కోరగా.., మండలంలోని పురుషోత్తపురం పరిసరాల్లోని మైహోం సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో అక్టోబర్ 22వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకున్నట్లు లక్ష్మోజి తెలిపారు. 24 వేల లీటర్ల డీజిల్ లోడ్‌తో ఉన్న ఎపి 05టిడి 9599 నెంబరు గల ఈ ట్యాంకర్‌ను సీజ్ చేసి దగ్గరలోని పెట్రోల్ బంక్ దగ్గర పార్క్ చేసినట్టు వెల్లడించారు. ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించగా వాహనం కాకినాడు ఆటోనగర్ నుంచి బయల్దేరిందని తెలిసిందన్నారు. అన్ని వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి అదే రోజు రాత్రి 10.30 గంటలకు యలమంచిలి రూరల్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెట్రోలియం ఉత్పత్తులు రవాణా చేయాలంటే ఫారం ఎఫ్ నిబంధనలు పాటించాలని, అవేవీ లేకుండా, లైసెన్స్, బిల్లులు కూడా లేకుండా పెట్రోలయం ఉత్పత్తులు తరలిస్తుండడంతో ట్యాంకర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

అనకాపల్లి ఎఎస్ఒ సిహెచ్.కల్యాణి వివరణ

ఇదే విషయమై అనకాపల్లి ఎఎస్ఒ సిహెచ్.కల్యాణిని వివరణ కోరగా... 22న ట్యాంకర్ సీజ్ చేసి పంచనామా నిర్వహించామని చెప్పారు. క్రిమినల్ చర్యల కోసం సిఫార్సు కూడా చేసినట్లు వెల్లడించారు. యలమంచిలి రూరల్ స్టేషన్‌కు నిందితులను అప్పగించామని, అనంతరం వివరాలు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. వారినుంచి వచ్చే అదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పెట్రోల్ బంక్ ఆవరణలో ఉన్న డీజిల్ ట్యాంకర్

యలమంచిలి రూరల్ పోలీసుల వివరణ

ఈ విషయంపై యలమంచిలి రూరల్ పోలీసులను వివరణ కోరగా... ట్యాంకర్ యజమాని రాజమండ్రికి చెందిన వెంకటరెడ్డిగా గుర్తించామని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన డ్రైవరు, క్లీనర్లపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ అన్నారు. కశింకోటలో శనివారం ఆయన పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి వెదురుపర్తికి ప్రధాన రహదారి నిర్మాణం వారం రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. కశింకోట ప్రాంతంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు, అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, కశింకోట, అనకాపల్లి ఎంపిపిలు కలగా లక్ష్మి, గొర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయరజని, ఎమ్‌పిడిఒ కొంకి అప్పారావు, వైసిపి నాయకులు మళ్ళ బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెంటకొట శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో ఇల్లు లేని ప్రతి పేదవానికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో శనివారం 33 మంది లబ్ధిదారులకు సంపూర్ణ గృహ హక్కు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బంధం అప్పలనాయుడు, వైసిపి నాయకులు సేనాపతి హరికృష్ణ, కరణం రమణ, కల్లేపల్లి శ్రీను, ఈవోపిఆర్‌డి ధర్మారావు పాల్గొన్నారు.

పట్టాభిరామ్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు పట్ల హర్షం

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టరు బివి.పట్టాభిరామ్‌కు ప్రతిష్టాత్మకమైన వైయస్సార్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు-2022ను ప్రభుత్వం ప్రదానం చేయడం పట్ల స్థానిక అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాజీ విసి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు ఆహ్వానం మేరకు డాక్టరు పట్టాభిరామ్ మాడుగుల, చోడవరం, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసానికి విశేషమైన కృషి చేశారని గుర్తు చేశారు.

మండలంలో 66 పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఈ సంవత్సరం మండలంలో 66 పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయధికారి సోమశేఖర్ తెలిపారు. శనివారం ఏ.కోడూరు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు పంటకోత ప్రయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో పంట దిగుబడి అంచనా వేయడానికి పంట కోత ప్రయోగాలు చేస్తారని పేర్కొన్నారు. సహాయ గణంక అధికారి శ్రీనివాసరావు వ్యవసాయ సహాయకులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సోమశేఖర్

న్యాయ క్రియాశీలత అవసరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు

ప్రజాశక్తి- సబ్బవరం

న్యాయపరమైన క్రియాశీలతను ఒక వరం లేదా శాపంగా చూడకూడదని, దానిని ఒక అవసరంగా చూడాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్.సోమయాజులు అన్నారు. 'న్యాయ క్రియాశీలత - వరమా లేదా శాపమా' అన్న అంశంపై జస్టిస్ ఇ.వెంకటేశం స్మారక ఉపన్యాసం దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో శనివారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయాజులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని పేదవాడికి న్యాయం చేయడానికి సహాయం చేసిన ముఖ్యమైన తీర్పులను చర్చిస్తూ జ్యుడిషియల్ యాక్టివిజం ప్రస్తుత భారతీయ సమాజంలో అవసరమని చెప్పారు. సాధారణ వ్యక్తికి న్యాయం చేసేందుకు న్యాయపరమైన క్రియాశీలతను ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై ముఖ్యమైన మైలురాయి తీర్పులను ఆయన ఉదహరించారు. మానవీయ కోణం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. సుప్రీం కోర్టు పలు సందర్భాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడం వల్లే అనేక కేసులలో లక్షలాది మంది లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఒక చట్టాన్ని ఎంత మెరుగ్గా ఎలా అమలు చేయవచ్చో నొక్కి చెప్పేందుకు జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ విఆర్ కృష్ణ అయ్యర్, జస్టిస్ పిఎన్ భగవతి ఇచ్చిన తీర్పులను ఉదహరించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ ఇ.వెంకటేశం కుటుంబ సభ్యులు, అకడమిక్ డైరెక్టర్ దయానంద మూర్తి, న్యాయశాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ రికవరీ జిఒను ఉపసంహరించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : మున్సిపల్ కార్మికులు ఐదు రోజులపాటు సమ్మె పోరాటాల ద్వారా సాధించుకున్న రూ.6వేలు హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించాలని కోరుతూ శనివారం జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఇచ్చిన ఆరు నెలల అలవెన్స్ రూ.36వేలు కార్మికుల జీతాల నుంచి రికవరీ చేయాలని జీవో జారీ చేయడం దారుణమన్నారు. ఈ జీవోను ఉపసంహరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హెల్త్ అలవెన్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యేసు రాజు, గోవిందు, బొమ్మల రాము, అజయ్, వాసు, నూకరాజు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న జివిఎంసి కార్మికులు

సురక్షిత బ్యాంకింగ్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సురక్షిత బ్యాంకింగ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. సురక్షిత బ్యాంకింగ్ జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూడిమడక రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంతర్గత ఫిర్యాదుల పరిష్కార విధానం, సైబర్ నేరాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవి కిషోర్, రిటైర్డ్ ఎస్బిఐ డైరెక్టర్ విజయ్ కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యన్నకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి- సబ్బవరం : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడిని సబ్బవరం మండలానికి చెందిన టీడీపీ నాయకులు శనివారం కలిసి పరామర్శించారు. అయ్యన్నను కలిసిన వారిలో టిడిపి నాయకులు భరిణికాన సాయినాథరావు, మహాలక్ష్మి నాయుడు, రొంగలి దేముడు, రేసుపూడి రమణ, పల్ల తాతారావు, గవర అప్పారావు, పంచాడ శ్రీను, బొకం బాలకృష్ణ, గవర సత్యనారాయణ, గండి వెంకట రమణ, మొల్లి కనకరాజు, రాపర్తి బాబురావు, పైలా వెంకట రమణ, గొంప నాయనప్ప, దొగ్గ చిన్నయ్య ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2021-22 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు చైతన్య గొంప ఛారిటీ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకం అందజేసింది. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న అల్లాడ గుణవర్షిని, పెనగంటి గణేష్, గేదెల ఉమామహేశ్వరి, గొండ సాయికుమార్, ఆదిరెడ్డి సురేంద్ర, జక్కిలింకి భావనకు నగదు బహుమతులు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్లేటి కరుణాకరరావు ఎస్ఐ డి.నాగేంద్ర, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

'మూడు రాజధానుల పేరుతో ఎంతకాలం మభ్యపెడతారు'

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యలను గాలికి వదిలి ప్రజలను దారి మళ్లించేందుకు ప్రభుత్వం మూడు రాజధానులు అంశాన్ని తెరపైకి తెచ్చిందని జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు పరుచూరి భాస్కరరావు విమర్శించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన నేపథ్యంలో వచ్చిన అనూహ్య స్పందనను చూడలేక తమ పార్టీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. మూడు రాజధానులు పేరుతో ప్రజలను ఎంత కాలం మోసగిస్తారని ప్రశ్నించారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని టి.సిరసపల్లి పంచాయతీ రామారాయుడు పేట గ్రామంలో నాడు- నేడు కింద ఎంపిపి స్కూల్ భవనం నిర్మాణానికి, పంచాయతీలో కొత్తగా డ్రైనేజీల నిర్మాణానికి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మద్దాల వీరి నాయుడు, వార్డు సభ్యుడు కె.నీల నాగేశ్వరరావు, హెచ్ఎం రాధాదేవి, స్కూల్ కమిటీ ఛైర్మన్ కె వీరభద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించినట్లు స్థానిక వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. కాన్పూర్ ఐఐటి వారు ఆవిష్కరించిన భూపరీక్షక్ అనే నూతన పరికరం ద్వారా నేల స్వభావం, పోషకాల లభ్యతను రెండు నిమిషాలలో పరీక్షించవచ్చని చెప్పారు. మండలంలోని అమృతపురం, అసకపల్లి, మల్లునాయుడు పాలెం గ్రామాలలో రైతుల సమక్షంలో క్షేత్ర స్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించి రైతు భరోసా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఏ.శిరీష, టి.శ్రీదేవి, జె.ప్రసాద్, నాయక్, సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు, సిహెచ్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై దృష్టి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వరి తెగుళ్లపై రైతులు దృష్టి సారించాలని సీనియర్ శాస్త్రవేత్త వి గౌరీ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో రైతులకు వరి తెగుళ్లపై ఆశించే చీడపీడల నివారణ వంటి వాటిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ జి.తిరుమల రావు, ప్రోగ్రాం సపోర్టర్ వి.వెంకట రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతులు ఆడారి అర్జున్‌రావు, ఆదిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లపై శబరిమల యాత్ర

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప స్వామి భక్తులు శనివారం సైకిళ్లపై శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ సైకిల్ యాత్రను ఏపీ గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కర్రి ఆదిబాబు, పూడి గోవింద, కారు కనకరాజు సైకిళ్లపై బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి బాపు నాయుడు, టిడిపి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు శరగడం జగ్గారావు, ఉపసర్పంచ్ బీసెట్టి రాము, గురు స్వామి మల్ల శివ పాల్గొన్నారు.

సగర ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వడ్డాది : గాజువాక నియోజకవర్గం పరిధి బొర్రమాంబ సగర కాలనీ నుండి ఈ నెల 6న ప్రారంభిస్తున్న సగర ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా సగర సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రం నూకరాజు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సగర కులస్తులను బిసి-డి నుండి బీసీ-ఏకి మార్చాలని, తమ పిల్లలకు విద్యా ఉద్యోగ రాయితీలు కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలకు తూట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో ఎన్నికల కమిషన్ ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని టిడిపి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్ల జోక్యం ఉండరాదని ఆదేశించినా, అందుకు భిన్నంగా వాలంటీర్లు ఎమ్మెల్సీ ఓట్ల నమోదు దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు డీఈవోలపై ఒత్తిడి తెచ్చి దొంగ ఓట్లు నమోదు చేయిస్తున్నారన్నారు.

అక్రమంగా చేపల చెరువులు నిర్వహిస్తున్న

యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా చేపలు చెరువులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. అనుమతుల్లేని చెరువులను వెంటనే మూసి వేయాలన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో చేపల చెరువులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ జిఒ 7-15ను ఉల్లంఘించి యథేచ్ఛగా పశుమాంసం, చికెన్ వ్యర్థాలతో చెరువుల్లో చేపలు పెంపకం చేస్తున్నారని, దీనిపై ఫిర్యాదులు రావడంతో వ్యర్థాలు కనబడకుండా తగలబెడుతున్నారని తెలిపారు. ఆహార పంటలు పండే భూముల్లో చేపల చెరువులు తవ్వకూడదన్న ప్రాథమిక నిబంధనలు పాటించకపోయినా అధికారయంత్రాంగం చేతి వాటానికి అలవాటుపడి నోరుమెదపడం లేదని విమర్శించారు. పంట పొలాల మధ్య ఈ చెరువులేంటని



చేపల చెరువును పరిశీలిస్తున్న వెంకన్న

రైతులు గగ్గోలు పెడుతున్నా స్పందించే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల అండ, అధికారుల సహకారం ఉండడంతో మండలంలో దాదాపుగా వెయ్యి ఎకరాలు వరకు పంట భూములు చేపలు చెరువులుగా మారిపోయాయని తెలిపారు. దేవరాపల్లి మండలంలో ఎం.అలమండ, కొత్తపెంట తారువ, చేనులపాలెం, పెదనందిపల్లి, కలిగొట్ల, బోయిల కింతాడ, మారేపల్లి, దేవరాపల్లి తదితర గ్రామాల్లో ఈ అక్రమ వ్యాపారం సాగుతుందని పేర్కొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి- సబ్బవరం : అవినీతి రహిత సమాజానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో విజిలెన్సు వారోత్సవాలలో భాగంగా అవినీతి రహిత అభివృద్ధి చెందిన దేశం అన్న అంశంపై మహిళలు, విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. అనంతరం జాగృతి ఎమ్‌డి కందర్ప సుజాత సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సాగర్ స్వరూప్, జాగృతి ప్రతినిధులు కోటిని అమ్మతల్లి నాయుడు, కాపుశెట్టి రమణమ్మ, కెవిఎన్ మౌక్తిక, వివి సుబ్రహ్మణ్యం, పి.రమేష్ పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

అనకాపల్లి : మండలంలోని సీతానగరంలో కేంద్ర నిఘా వారోత్సవాల్లో భాగంగా గ్రామస్తులు, ఖాతాదారులతో అవినీతికి వ్యతిరేకంగా శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ తుమ్మపాల బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ లంచం ఇవ్వడం తీసుకోవడం నేరమని, దేశ అభివృద్ధికి ఇది ఆటంకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సిఎన్‌పి అయినాల దేవి, గ్రామ సర్పంచ్ సుంకర చంటి పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు సకాలంలో చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో వరి పంటలో సుడిదోమ ఉధృతి ఉన్న నేపథ్యంలో సకాలంలో నివారణ చర్యలు చేపట్టి పంటను సంరక్షించాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివిఔ.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఎఆర్ఎస్‌లో శనివారం శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణంలో సుడిదోమ పంటను తీవ్రంగా ఆశించి నాశనం చేస్తుందన్నారు. పొలంలో ఉన్న మురుగునీటిని తొలగించాలన్నారు. వరి దుబ్బుకు 10 కంటే తక్కువ పురుగులు ఉంటే ఎకరాకు ఒక లీటర్ వేప నూనె, 10 కంటే ఎక్కువ ఉంటే పెమెట్రోజోన్ 120 గ్రాములు లేదా, ట్రై ఫ్లూ మేజో ఫైరిమ్ 100 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే వారంలో రెండుసార్లు ఇదే క్రమంలో పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని లీలావతి, ఆత్మ పిడి ఆశా దేవి, అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు, వివిధ డివిజన్ల ఏడీఏలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : భవన నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపిపి కోన సంధ్య బుజ్జి అన్నారు. మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేస్తున్న భవన నిర్మాణ పనులను శనివారం ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో నిర్మిస్తున్న డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సందీప్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల వల్ల రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రశేఖర్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - దేవరాపల్లి : స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వర ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు మొల్లి కృష్ణమూర్తి తదితరులు ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. గండేపల్లి శ్రీనివాసరావు, వాలేటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మహోత్సవాలకు తరలిరావాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న విశాఖ ఆర్కే బీచ్‌లోని గోకుల పార్కులో జరుగు రాధాకృష్ణ మహోత్సవాలకు తరలిరావాలని జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు ఎలమంచిలి ధర్మారావుయాదవ్, మండల అధ్యక్షుడు నంబారు అప్పారావు యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



గృహాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రాము తదితరులు

గృహాలు నిర్మించి ఇవ్వాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రోడ్డు విస్తరణ బాధితులకు స్థలాలు ఇవ్వడంతో పాటు గృహాలు నిర్మించి ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ బాధితులకు చౌడపల్లిలో కేటాయించిన స్థలాలను శనివారం ఆయన బాధితులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు, భూములు, షాపులు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు కిరణ్, కనకరాజు, బాబురావు, రమణ, అబ్బాయి నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో వ్యవసాయ శాఖ అధికారులు సామాజిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి వై.కాంతమ్మ మాట్లాడుతూ పురుగుల మందులు, ఎరువులు నాణ్యత ప్రమాణాలు పరీక్షించడానికి నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. పురుగుల మందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాస్త్రవేత్తల సూచనలు మేరకు రైతులకు మందులు విక్రయించాలని సూచించారు.

రేషన్ లబ్ధిదారులకు జగన్ మొండి చెయ్యి

ప్రజాశక్తి-అనకాపల్లి : రేషన్ డిపోలో పేద ప్రజలకు అందించే కందిపప్పు, పంచదారను దూరం చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారికి మొండిచేయి చూపారని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కందిపప్పు పంచదార ధరలు భారీగా పెరగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు నెలలుగా రేషన్ డిపోల ద్వారా ఈ సరుకులు పంపిణీ చేయలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.రామకృష్ణ పాల్గొన్నారు.

పిఎం కిసాన్‌కు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతు భరోసా, పీఎం కిసాన్‌కు ఈకెవైసీ నమోదు తప్పనిసరి అని, ఇప్పటి వరకు చేయించుకోనివారు ఉంటే తక్షణమే చేసుకోవాలని తుమ్మపాల గ్రామ వ్యవసాయ సహాయకురాలు మనీషా అన్నారు. మండలంలోని తుమ్మపాల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంకు రుణాల కోసం రైతులకు ఈ-క్రాప్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీలా మురళి, పడాల గణపతిరావు, బొడ్డపాటి నూకు నాయుడు, కె.శ్రీనివాసరావు, మోది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని భరణికం, పరవాడ పంచాయతీలో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష సమగ్ర సర్వేలో భాగంగా పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్ అధ్యక్షతన శనివారం రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, తహసీల్దార్ వి.ప్రకాశరావు, ఎంపిడిఓ హేమసుందర రావు, డిప్యూటీ తహసీల్దార్ వరహాలు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, పైల అప్పలనాయుడు, వి.ఆర్.ఓ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి వెంకటపద్మ లక్ష్మీ

ఇండియన్ ఫుడ్ ఎక్స్‌పోర్టు కంపెనీలో

400 కిలోల జీడిపప్పు చోరీ

పోలీసులకు కంపెనీ మేనేజర్ ఫిర్యాదు



కంపెనీలో నిల్వలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో ని ఇండియన్ ఫుడ్ ఎక్స్ పోర్టు కంపెనీలో 400 కేజీల జీడిపప్పు శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ అజయ్ కుమార్ రాదామని రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేనేజరు అజయ్ కుమార్ రాదామని మాట్లాడుతూ, గుడ్డిప, తట్టబంద వెళ్లే రోడ్డు పక్కన 2017లో ఇండియన్ ఫుడ్ ఎక్స్పోర్ట్ కంపెనీని పెట్టామన్నారు. అప్పటి నుంచి నేటి వరకు 170 మంది మహిళలు 10 మంది పురుషులు దినసరి వేతనంతో పని చేస్తున్నారన్నారు. కంపెనీకి నైట్ వాచ్‌మెన్ లేనందున మేనేజరు, సిబ్బంది రాజేంద్ర, అఖిల్ మోహన్, అజయ్ కుమార్‌లతో పాటు తాను గత రెండు సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ కంపెనీ పరిధిలో రాత్రింబబళ్లు నివాసం ఉంటున్నామన్నారు. శుక్రవారం ఎప్పటి లాగానే సాయంత్రం 6 గంటలకు కంపెనీకి తాళాలు వేసుకుని దినసరి కూలీలు వెళ్లి పోయామన్నారు. తాను నలుగురు సిబ్బంది రూములకు తాళాలు వేసుకొని తమ తమ గదుల్లో పడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. శనివారం ఉదయం యధావిధిగా తెలుపులు తెరవగా జీడిపప్పు ట్రేలు ఖాళీగా ఉండటంతో ఒకసారిగా అవాక్కయ్యామన్నారు. అక్కడ పరిసర ప్రాంతాలన్నీ వెతకగా కిటికీ ఐరన్ గ్రిల్స్ కత్తిరించి సుమారు 20 ట్రెలలో గల 400 కేజీల జీడిపప్పు దొంగలించినట్లు గుర్తించామన్నారు. రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేయగా సర్పంచ్ గుమ్మాల గణేష్‌రావు, కంపెనీ సిబ్బంది సమక్షంలో తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. దొంగలను పట్టుకొని తమకు న్యాయం కల్పించాలని ఆయన పోలీసులను కోరారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబురావు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట గ్రామంలో శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబురావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీలక తీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పలువురు మహిళలు ఇల్లులు మంజూరు చేయాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గోసల కాసులమ్మ ,మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి,వైసిపి నాయకులు ఏరిపిల్లి నాగేష్,శీరం నరసింహమూర్తి ,చంద్రరావు,బాబురావు ,సూరకాసుల గోవింద్ ,రామకష్ణ ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ,పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -రావికమతం: ఇటీవల అనారోగ్యంతో కవగుంట మాజీ సర్పంచ్ దాసరి రామునాయుడు మతి చెందడంతో తనయుడు, ప్రస్తుత సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలను శనివారం ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ స్వగ్రామంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, 1984 నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తనదైన ముద్ర వేసుకొని పార్టీలో కీలక పాత్ర వహిస్తూ గ్రామానికి మూడు దఫాలుగా సర్పంచ్‌గా రామునాయుడు పనిచేసి అనేక రకాల సేవలు అందించడం ఎంతో గర్వకారణం అన్నారు. పరామర్శించిన వారిల సర్పంచ్‌లు రవికుమార్, రామకృష్ణ, వార్డు మెంబరు ప్రగడ నాగేశ్వరరావు, చంద్రాన రామ నాయుడు, బీరా పద్మ, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కంటుముఖి నాగేశ్వరరావు ఉన్నారు.

అనుమానాస్పద మృతిపై

జీరో ఎఫ్ఐఆర్ నమోదు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన వలస కూలీ గాలి రాజబాబు అనుమానాస్పద మృతి పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని కొత్తకోట ఎస్ఐ విభూషణరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకర్లు కు ఆయన తెలిపిన వివరాలు..ఒడిశా రాష్ట్రం రాయగడ ప్రాంతంలో కూలీ పనుల నిమిత్తం వలస వెళ్లిన గాలి రాజబాబు అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఆయన భార్య రాము ఫిర్యాదు చేసిందని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మృతదేహం తో అంబులెన్సులో ప్రయాణించిన సహచర కూలీలు, కాంట్రాక్టర్ అప్పలనాయుడు లను విచారించగా రాజబాబు పని చేస్తూ వెనకకు తిరగబడి పడి పోవడం తో పాటు పక్షవాతం వచ్చి మృతి చెందినట్టు వారు చెప్పారర్నారు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్టు తాము జరిపిన ప్రాథమిక విచారణలోను వెల్లడి అయినట్టు ఎస్ఐ చెప్పారు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఒడిశా పోలీసులకు సమాచారం ఇచ్చామని ఎస్ఐ విభూషణరావు పేర్కొన్నారు.

చందనాడ దళితుల భూములకు

నష్టపరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి:వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన చందనాడ దళితుల డీ ఫారం భూములకు, గుల్ల బట్టీల భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపిఎం మండలం కార్యదర్శి ఎం.రాజేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం చందనాడ లో దళితులు భూములను పరిశీలించారు. దళితులు తమ సమస్యను అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, 1975 సంవత్సరంలో చందనాడ దళితులకు ఆనాటి ప్రభుత్వం గ్రామంలోని సర్వే నెంబర్లు 120/5లో 18 ఎకరాలు 6 మందికి, సర్వే నెంబర్లు 135,137,138లలో 43 ఎకరాల 23 సెంట్లు 26 మందికి డీ.ఫారం భూములు ఇచ్చిందని, వాటిని నమ్ముకుని దళితులు జీవిస్తున్నారని తెలిపారు. ఈ భూములు అభివృద్ధికి ఎస్సీ కార్పోరేషన్ అధికారులు అర్థిక సహాయం అందించారని, వీటితో పాటు తరతరాలుగా సంప్రదాయంగా చందనాడ రెవెన్యూ సర్వే నెంబర్లు 65/2, 65/3లలో సుమారుగా 10 ఎకరాల 50 సెంట్లు భూములలో గుల్లబట్టీలలో గుల్ల కాల్చుకొని తద్వారా జీవనోపాధిని పొందుతున్నారని తెలిపారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ పేరుతో దళితులకు చెందిన డీ ఫారం, గుల్ల బట్టీల భూములను కూడా అధికారులు సేకరించారని, కాబట్టి ఆ భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దళితులకు ఈ భూములు తప్ప వేరొక ఆధారం లేదని నిరుపేదలని, వారి పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దళితుల డి ఫారం భూములను అధికారులు ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. వెంటనే భూముల సర్వేలు పూర్తి చేసి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళితులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందనాడ దళిత నాయకులు ఏడిద సన్యాసి, ఏడిద మన్నియ్య, ఏడిద పోతురాజు, పెదపూడి సువర్ణరాజు, ఏడిద దేముళ్ళ, గోరింట పోతురాజు, ఏడిద ఏసు, ద్రాక్షారపు రాజు, ఏడిద నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న అప్పలరాజు, గ్రామస్తులు

సృజనాత్మక కృత్యాలు తయారీ

ప్రజాశక్తి-నాతవరం:మండలంలోని గాంధీనగరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా లాంగ్వేజ్, గేమ్స్, పప్పెట్ సో, డ్రాయింగ్ ఆటలు, సృజనాత్మక కృత్యాలు తయారీ ప్రధానోపాధ్యాయుడు కాసపు నానాజీ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించారు. వివిధ వస్తువులతో ఆకర్షణీయమైన బొమ్మలు, పపేట్స్ తయారు చేశారు. ఆట, పాటలతో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



కృత్యాలను చూపుతున్న విద్యార్థులు

గురుస్వాములకు సన్మానం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు గ్రామంలో శనివారం కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా గురుస్వాములను ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన భార్గవ రాజు నివాసం వద్ద అయ్యప్పదీక్షా పరులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపమాక గ్రామానికి చెందిన గురుభవాని దవరసింగి రాంబాబును రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ,అయ్యప్ప పీఠం భక్తులు తదితరులు ఘనంగా సన్మానించారు. ఉపమాక గురుభవానీ పీఠం తరపున వేంపాడు గురుస్వామి ఎంఎస్ఎన్ రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో చందనాడ ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజయ్యపేటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట గ్రామంలో శనివారం 104 వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు పలువురు రోగులను పరీక్షించి, మందులను అందజేశారు. ప్రతి నెల మొదటి శనివారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి దగ్గర నుండి కదలలేని పేషెంట్ల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి స్కూల్లో గర్భిణీ, బాలింతలకు వైద్యాన్ని అందించడం జరుగుతుందని ఎంఎంయు వైద్యులు కీర్తి తెలిపారు. గొడిచెర్ల పి హెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి నెల మొదటి శనివారం రాజయ్యపేటలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, గర్భిణీలకు, బారింతలకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు పిక్కి కామేశ్వరరావు, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్

డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:జగనన్న శాశ్వత భూ హక్కులో భాగంగా శనివారం మండలంలోని అమ్మపేట గ్రామంలో డోన్ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిద్దర దేముడునాయుడు, గ్రామ పెద్దలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పెదబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సహజ మరణం దిశగా నెట్టే కుట్రలు

▶▶ రాజకీయ పార్టీల నేతలు స్పందించాలి ▶▶ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ దీక్షల్లో నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం
స్టీల్‌ప్లాంట్‌ను సహజ మరణం దిశగా నెట్టే కుట్రలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగుతున్నాయని, వీటిపై రాష్ట్ర రాజకీయ నేతలు స్పందించి కర్మాగార పరిరక్షణకు పాటుపడాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 632వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో టిపిపి, పిఇఎం, ఆర్ఇడి, స్టోర్స్, ఎస్‌డి విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు బొడ్డు పైడిరాజు, జె.రామకృష్ణ, ఎన్.రామారావు, కె.రాజబాబు, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. విశాఖ ఉక్కును అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు.

జెఎసి ఆధ్వర్యాన..

కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 583వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ కమిటీ సభ్యులు, వైఎస్ఆర్‌టియు స్టీల్‌ప్లాంట్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. దీక్షల్లో గొల్ల రాము, గొలగాని అప్పారావు, ఎస్.గణేష్, సూరిబాబు, వరాలమ్మ, వై.మస్తానప్ప, కర్రి దాలినాయుడు, పిట్టా రెడ్డి, బోర శేషభూషణరావు, గెద్దాడ అప్పలరాజు, జివి.రమణారెడ్డి, గొందేసి అప్పలరెడ్డి పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఉద్యోగులు

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం

విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చైర్మన్ ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'ఉక్కు'పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్ఎస్.శివశంకర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం మాట్లాడారు. ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రధాని విశాఖ వేదికగా ప్రకటించాలన్నారు. సమావేశంలో విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు బి.నాగభూషణం (ఐఎన్‌టియుసి), ఆర్‌కెఎస్‌వి.కుమార్ (సిఐటియు), బిసిహెచ్.మసేన్ (ఎఐటియుసి), పి.వెంకటలక్ష్మి (సిఎఫ్‌టియుఐ), వై.కొండయ్య (ఐఎఫ్‌టియు), వై.మస్తానప్ప (వైఎస్ఆర్‌టియుసి), డి.జగదీష్ (టిఎన్‌టియుసి), దొమ్మేటి అప్పారావు (హెచ్ఎంఎస్), ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమారమంగళం (పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ), ఎల్‌జె నాయుడు, కుసుమ (ఎస్ఎఫ్ఐ), యుఎస్ఎన్ రాజు (డివైఎఫ్ఐ), నిర్మల (అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య), ఎం.చంటి (ప్రజానాట్యమండలి), ఎం.వెంకటలక్ష్మి (పిఒడబ్ల్యు) షిప్‌యార్డు, బిహెచ్ఇఎల్, పోర్టు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.ప్రసాద్, బిఎస్ఎన్.రాజు, జిటిపి ప్రకాష్, కె.ఈశ్వరరావు, సాగర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సమీక్షా సమావేశాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల తీరు, విధి విధానాలపై నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆధ్వర్యంలో వైసిపి క్యాంపు కార్యాలయంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 6న సిహెచ్.నాగాపురం, కొంగసింగి, లింగంపేట, లింగన్నదొరపాలెం, చోద్యం, 7న గాదంపాలెం, చిన్నయ్యపాలెం, అమ్మపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, 8న సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెం, ఎన్.కంఠారం, యర్రవరం, చీడిగుమ్మల, 9న పుత్తడిగైరంపేట, రావణాపల్లి, కొమిర, గుండుపాల, కశిమి, 10న ఏటిగైరంపేట, యల్లవరం, కేడిపేట, జోగుంపేట, పాతమల్లంపేట గ్రామాలకు సంబంధించి పార్టీ ఇంచార్జీలు, గ్రామ వాలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. .

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో ఇటీవల మృతి చెందిన మహిళ కుటుంబానికి కవగుంట గ్రామ సర్పంచు దాసరి సూర్య కుమారి వరహాలు, భవన నిర్మాణక కార్మిక సంఘం అధ్యక్షులు ప్రగడ నాగేశ్వరరావు చేతుల మీదుగా శనివారం రూ.2000లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సంఘంలో కుటుంబ సభ్యులు మరణించిన వెంటనే ఆర్థికంగా ఆ కుటుంబాలను ఆదుకోవడం మంచి పరిణామన్నారు. సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ అనేక సేవలు అందించాలని తెలిపారు. సంఘం అభివృద్ధి కొరకు గ్రామ పంచాయతీ తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నాగేశ్వరావు, ఉపాధ్యక్షుడు పచ్చికూర వరహాలు, తరాయి వరహాలు, వెచ్చం చిన్న నాగరాజు ,కోన ఈశ్వరరావు, దండి మణికంఠ, షేక్ వెంకటి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న సంఘం అధ్యక్షులు


అభినందనలు తెలుపుతున్న డైరెక్టర్లు

నారాయణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్: పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో నింజాస్ అకాడమీకి స్పోర్ట్స్ కిట్స్ నిమిత్తం రూ.15వేలు, స్థానిక ఎస్సీ హాస్టల్లో పిల్లలకు ఇద్దరి బాలికలకు 10వేల రూపాయల చొప్పున స్కాలర్షిప్ అందజేశారు. ఏరియా ఆసుపత్రికి ఫ్రిజ్, సామగ్రి అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి హాస్టల్ పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్స్, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ గ్రామంలో వాహన తనిఖీలు ఎఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం చేపట్టారు. వాహనాల ఫైన్ రుసుం చెల్లించని వాహన దారులు మీ సేవ ద్వారా చలానా కట్టాలని ఏఎస్సై తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.


తనిఖీ చేస్తున్న పోలీసులు

సెల్‌ఫోన్ కోసమే బాలుడు హత్య

▶▶ ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు
▶▶ తిరుపతిలో పట్టుబడ్డ నిందితుడు
▶▶ అనకాపల్లి డిఎస్‌పి సునీల్ వెల్లడి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం పడాలపాలెంలో గత నెల 16న 13 ఏళ్ల బాలుడిని సెల్‌ఫోన్ కోసం హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు అనకాపల్లి డిఎస్పీ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకర్లతో డిఎస్‌పి మాట్లాడుతూ, మాకవరపాలెం మండలం తాడపాల గ్రామానికి చెందిన నిందితుడు గనిశెట్టి వెంకటసూర్యనాగేశ్వరరావును అరెస్టు చేయడం జరిగిందన్నారు. నిందితుడు మొబైల్ ఫోన్ కోసం బాలుడిని హత్య చేసి పరారయ్యాడన్నారు. 20 రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితుని కోసం ఐదు ప్రత్యేక బృందాలు గాలించి ఎట్టకేలకు పట్టుకోకున్నామని తెలిపారు. ఈ నెల 16న పడాలపాలెం గ్రామానికి చెందిన పడాల సురేష్(13) గేదెలను మేపడానికి పొలాల్లోకి వెళ్లాడని, సాయంత్రానికి గేదెలు ఇంటికి చేరాయి. కానీ, సురేష్ ఇంటికి రాలేదని తెలిపారు. తాడపాల గ్రామానికి చెందిన నిందితుడు నాగేశ్వరరావు అదే రోజున పడాలపాలెం పొలాల్లోకి వెళ్లాడరని, అదే సమయంలో గేదెలు మేపుతున్న సురేష్ వద్ద సెల్‌ఫోన్ చూశాడని తెలిపారు. ఆ సెల్‌ఫోన్ ఇవ్వమని నాగేశ్వరరావు అడగటంతో ఇవ్వక పోవడంతో పక్కనే ఉన్న జీడితోటల్లోకి తీసుకువెళ్లి మెడకు వైరు చుట్టి హత మార్చినట్లు నిర్ధారణ అయిందన్నారు. గేదెలను మేపడానికి పొలాల్లోకి వెళ్లిన సురేష్ ఇంటికి రాక పోవడంతో కంగారుపడిన తల్లిదండ్రులు గ్రామంలో వెతికారన్నారు. సమీప తోటలో సురేష్‌ను హత్య చేసి పడేసినట్లు తెలియడంతో వెంటనే తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో, దర్యాప్తు చేపట్టామని, ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి 15 రోజులుగా శ్రమించి 4వ తేదీన తిరుపతిలో నిందితుడు నాగేశ్వరరావును అదుపులో తీసుకున్నామని తెలిపారు.అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో కొత్తకోట సిఐ సయ్యద్ అహ్మద్ ఇలియాజ్, రోలుగుంట ఎస్సై నాగకార్తీక్ ఉన్నారు.


మాట్లాడుతున్న డిఎస్పీ సునీల్

బంద్ విజయవంతంపై కృతజ్ఞతలు

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: తనకు జరిగిన అన్యాయం, దౌర్జన్యంపై స్పందించి స్వచ్ఛందంగా బంద్ చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఈ నెల 2న అర్ధరాత్రి సిఐడి పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తించి తనను అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 3న నర్సీపట్నంలో చేపట్టిన బంద్ విజయవంతం చేయడానికి సహకరించిన వారందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. తనపై అభిమానంతో స్వచ్ఛంధంగా బంద్ చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. బ్యాంకులు, కిరాణా వర్తకులు, బట్టల షాపులు, షాపింగ్ మాల్స్, హెూటళ్లు, రెస్టారెంట్, ఎస్‌బిసి, పోస్టాఫీసు, సెల్ఫోన్ దుకాణాలు, పెట్రోల్ బంకులు, కూరగాయల మార్కెట్ తదితరవి బంద్ చేశారన్నారు. డిఇఒ, ఎంఇఒ, ఆర్డీవోల నుంచి స్కూళ్లు తెరవాలని ఒత్తిడి చేసినప్పటికీ స్కూళ్లు, కళాశాలలు మూసి బంద్‌కు మద్దతు ఇవ్వడంపై సంతోష కరమన్నారు.



గిరిజనులకు తప్పని డోలీ మోత

ప్రజాశక్తి -కొత్తకోట: చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎంతో అట్టహసంగా దత్తత తీసుకున్న చలిసింగం గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం లేక డోలి మోతలు తప్పడం లేదు. శనివారం గ్రామానికి చెందిన చీపురు సత్తిబాబుకు ప్రమాదవ శాత్తు కాలికి గాయమైంది. నడవ లేని స్థితిలో ఉన్న సత్తిబాబును డోలీలో కొత్తకోట ఆసుపత్రికి తరలించారు.గ్రామంలో ఎవ్వరికి ఆరోగ్యం బాగో లేక పోయినా సుమారు మూడు కిలోమీటర్లు దూరం కొండ పై నుండి కిందకు, దిగువ నుంచి కొండ పైకి మోసుకు పోవాల్సిందే. గత నెలలో గ్రామానికి చెందిన కిముడు చంటిబాబు అనారోగ్యంతో మృతి చెందాడు. డోలిలో మోసుకు వెళ్తుండగా సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయాడు. విశాఖ కెజి హెచ్‌లో మీతి చెందిన మరో యువకుడు మృతదేహాన్ని కొండ దిగువ సికాయిపాడు గ్రామం నుంచి డోలి మోతలో గ్రామానికి అతికష్టంపై తరలించారు. ఈ గిరిజన గ్రామంలో సుమారు 500 మంది జనాభా కలిగి ఉన్నారు. వీరికి కనీస మౌళిక సదుపాయాలైన రహదారి, తాగు నీరు, మురుగు నీటి కాలువలు లేవు. ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీ లకు చెందిన నేతలు సదుపాయాలు కల్పిస్తామని నమ్మించి తర్వాత మరిచి పోతారని గిరిజనులు ఆరోపించారు.ఈ నెల 15 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డోలీలతో నిరసన చేపట్టనున్నట్టు గిరిజన సంఘం నాయకులు శంకరరావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు స్పష్టం చేశారు...


ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు